# "వాల్ పోస్టరు"

రచన :
... రాచకొండ శ్రీహరి ...

పాపం కాంత అమ్మగారు, రఘుని కాళ్ళావేళ్ళాపడి ప్రతి మాలింది తన కుమార్తె అరుణను వివాహమాడమని. కాని గోడలమీద సబ్బుబిళ్లల ప్రకటనకోసం అంటించిన పోస్టరులోగల అందగత్తెనుచూచి మోహించాడు. రఘు దానితో అరుణసంబంధం వదలుకున్నాడు. నిజానికి అరుణ ఎంత అందకత్తో అతనికి తెలియదు పాపం!

రఘు చిన్నతనంలోనే తల్లిదండ్రులు కరువు అయినారు. మంచి ఆస్తిమాత్రం చిక్కిందతనికి. చదువుకున్నాడు. ఊరికేవుండటమేమని ఒక చక్కని ఉద్యోగంకూడా సంపాదించుకున్నాడు మద్రాసులో.

అయితే రఘుకు అవవలసినంత తొందరగా పెళ్ళి కాలేదు. అ కాకపోవటం సంబంధాలు రాకపోవటంవల్ల కాదు, అతనికెవరూ నచ్చకపోవడంవల్ల.

అతనికి చిన్నప్పటినుంచీ చిదిపిదీపం పెట్టుకోటానికి వీలైన చిన్నదాన్ని పెళ్ళాడాలనే కోర్కెవున్నది. అందువల్ల అతని వివాహం వెనక్కు నడుస్తూవచ్చింది.

అతని ఆఫీసుకు ఇంటికి సుమారొక మైలుదూరం. ఈ మైలుపొడుగు రోడ్డుమీదగల ఇళ్ళన్నిటిలోకీ అతని కళ్ళు ప్రతినిత్యం జొరబడుతూనేవుండేవి. గాని అచూపులు దాహంతీర్చే సౌందర్యం మృగ్యమైంది.

ఏదో పాత చుట్టరికంగల కాంతమ్మగారి కుమార్తె అందకత్తె అని విన్నాడు కాని అపిల్లను చూడలేదు. కాంత అమ్మగారు కాళ్ళావేళ్ళా పడటంవల్ల, పిల్ల అందాన్ని అందరూ ఆమోదించడంవల్లా, అతడు కొంతవరకు అరుణను పెళ్ళాడటానికి మొగ్గాడు, కాని ఇంతలో ఒక అవాంతరం వచ్చి ఆ అవకాశాన్ని చెడగొట్టింది

ఒకరోజు మామూలుగా రఘు ఆఫీసుకుపోతున్నాడు. ఒకచోట దిగ్గున తలయెత్తేసరికి గోడమీదగల ఎడ్వర్టయిజుమెంటు పోస్టరులోవున్న ఒక అందకత్తె అతనివంకచూచి నవ్వుతూవున్నదని తెలిసింది. ఎంత అందంవున్నదామెలో! ఏమి సొగసు! ఏమి వయ్యారం!

అతడు అలాగే నిలబడిపోయాడు దీపపుస్తంభంలా. చూపులా పోస్టరుమీదపడి చెలగింతలాడటం ప్రారంభించినాయి. అసలాబొమ్మ ఒక టాయిలెట్ ఎడ్వర్టయిజుమెంటు కోసం అంటించారు. "నేనుభావించుకొన్న సౌందర్యమూర్తి ఇక్కడ సాక్షాత్కరించింది. లోకంలో ఇంతకుమించిన అందం ఎవరికీ వుండదు" అనుకున్నాడు రఘు.

ఆ చిత్రం ఎవరూ గీసిందికాదని ఫోటో అని బాగా గుర్తించాడు. ఐతే ఇంత అందకత్తె ఈ విశాల ప్రపంచంలో ఎక్కడో, ఏమూలనో దాగివున్నది. పైగా ఆమె అలాటి ప్రకటనలకోసం, సౌందర్యాన్ని బొమ్మలరూపంగా అమ్ముకొన్నది కాబట్టి ఆమె ఎక్కువ గొప్పవంశంలోకూడా పుట్టివుండదని అతడు నమ్మకం కలిగించుకున్నాడు.

పైగా అతడు పదిరాళ్ళు సంపాదిస్తున్నాడు. పెట్టెలో కూడా కొంతడబ్బు మూలుగుతొంది కాబట్టి అపిల్ల ఎక్కడ వున్నదో కనుక్కోగలిగితే ఆమెను తనదాన్ని చెసుకోవడం, ఆ అందాన్ని అందుకోవడం, దుర్లభం కాదనుకున్నాడు. అతనిలో ఎంత ఆనందం, ఎన్ని కెరటాలు?

ఆ చిత్రంవంకనే తనివితీరనట్లు అనేకసారులు చూచాడు. ఆ చిత్రం తన చూపులలో నిలచిన తరువాత ఆఫీసుకు బయలుదేరాడు. ఆ వీధిలో అనేకచోట్ల గోడల మీద అదే చిత్రం కనుపించి ఆతని కళ్లకు పండుగచేసింది. పైగా ఎటునుంచిచూచినా ఆ అందకత్తెచూపు లాతనిపైబడి దూసుకుపోతున్నట్లు కనుపించినాయి.

ఆరోజు మధ్యాహ్నం ఫలహారానికిలేచి బయటకు వచ్చినప్పుడు అతడు ఆ బొమ్మను చూస్తూనే నిలబడ్డాడు. ఆఫీసు వదలగానే ఆ బొమ్మదగ్గరకు ఒక్క పరుగుతీశాడు.

ఆ రాత్రిఅంతా ఆతడు ఆమె తన ఇంట్లో వున్నట్లు, ఆమెను తాను ప్రేమించి వివాహమాడినట్లు ఎన్నో కలలు గంటూ కాలంగడిపాడు.

ఆరోజునుంచీ అతని జీవితంలో చాలా మార్పు కలిగింది. ఆ గోడమీదచిత్రాన్నే హృదయంలో నిలుపుకున్నాడు. ఆ టాయిలెట్ కంపెనీవాళ్ళకు ఎడ్వర్టయిజుమెంట్లవల్ల అమ్మకం ఎక్కువ అయిందో లేదోగాని, ఒక యువకుడి హృదయంలోగల ప్రేమను రెచ్చగొట్టి అతని స్వప్నజగత్తులో ఒక దివ్యజ్యోతిని వెలిగించగలిగాడు.

ప్రతిరోజూ సాయంత్రంపూట ఆ బొమ్మలు వున్న గోడలచుట్టూ ప్రదక్షిణం చేస్తుండేవాడు. వాటినేదో మూగ సైగలతో పలకరించేవాడు. ఎంతో మురుస్తున్నేవాడు.

ఒకరోజు రఘు పత్రిక చదువుతున్నాడు. అందులో కూడ తాను గోడమీదచూచిన సుందరి చిత్రం పడింది. ఆ బొమ్మ చించుకున్నాడు. బజారుకు పరుగెత్తి మరిరెండు పత్రికలు కొనితెచ్చాడు. వాటినికూడ కత్తిరించాడు. ఒకటి తనపరుపుదిండుకు అతికించాడు. ఒకటి అద్దానికి అంటించి మూడవది మనిపర్సులో దాచుకొని తా నెక్కడికివెడితే ఆమెకూడ అక్కడికి వస్తుందని ఉవ్విళ్ళూరాడు.

కాని, రానురాను అతడు చాలా దీనస్థితిలో పడి పోయాడు పాపం. తానెంత వెర్రిలోపడ్డాడో అతనికేమీ అర్థం కాలేదు. చిట్టచివరకు ఆమె ఎవరో కంపెనీకి వ్రాసి కనుక్కోవాలని నిర్ధారణ చేసుకున్నాడు.

ఒకరోజు మంచి కవరు, లెటరుపేపరుతెచ్చి ఆ కంపెనీకి ఉత్తరంవ్రాశాడు. మీ ఎడ్వర్టయిజుమెంటు పద్ధతి నాకెంతో నచ్చింది. ముఖ్యంగా మీరు ప్రకటించిన ఫోటో అందంగా వున్నది. నా భార్యను అలాటిఫోటో తీయించాలని కుతూహలంగా వున్నది. కాబట్టి ఫోటోగ్రాఫరు తెలియచేస్తే సంతోషిస్తాను.

ఆ సబ్బుబిళ్ళల కంపెనీవాళ్ళు వ్యాపారానికి ముఖ్యంగా మర్యాదకావాలి గనుక తిరిగి రఘుకు ఉత్తరం వ్రాస్తూ, ఆ ఫోటోగ్రాఫరుపేరు తాము చెప్పలేమని, ఫలానా కంపెనీలో దాన్ని కొన్నామని వ్రాశారు.

తిరిగి రఘు ఆ కంపెనీకి ఉత్తరం వ్రాశాడు. పదిహేను రోజుల తరువాత వాళ్ళు జవాబు వ్రాశారు. మే మీ చిత్రాన్ని న్యూ స్ట్రీట్‌లో ఒకఫోటోగ్రాఫరుదగ్గర కొన్నామని.

ఆరోజునే రఘు పైనచెప్పిన ఫోటోగ్రాఫరు దగ్గరకు పరుగెత్తాడు. కాని దురదృష్టవశాత్తు ఫోటోగ్రాఫరు ఆ వీధిని విడిచి భవానీపూరు వెళ్ళాడని తెలిసింది. ఆ సాయంత్రమే రఘు భవానీపూరువెళ్ళి ఎలాగైతేనేం ఆ ఫోటోగ్రాఫర్ని పట్టుకున్నాడు.

పాపం; రఘుకు మొదట అయితే ఏమిచెప్పాలో తెలియదుగాని, కొంతసేపటికి ఒక ఆలోచనతట్టింది. తానొక ఫిలింకంపెనీ తాలూకు మనిషిననీ, ఆ ఫోటోలో పిల్ల నచ్చి ఆమెను బుక్‌చేయడానికి వచ్చాననీ చెప్పాడు.

ఫోటోగ్రాఫరు నవ్వి ఇలాచెప్పాడు — "నా మిత్రుడొకడు ఆమెను స్టుడియోకుతీసుకువస్తే నేనాచిత్రంతీశాను. అది జరిగి అప్పుడే రెండేళ్ళుదాటింది. బహుశః నామిత్రుడు ఆపిల్లను పెళ్ళాడాలని అనుకున్నాడేమోగాని ఇంతలోనే మరణించాడు, తర్వాత నే నా బొమ్మను ఎడ్వర్టయిజుమెంటుకు ఉపయోగించదలచి, ఆమెకొక వందరూపాయలిచ్చి తీసుకున్నాను. నిజం చెప్పాలంటే నేను దానివల్ల చాలా లాభంతిన్నాను. ఇప్పుడు వాళ్ళు మౌల్వీవీధిలో వున్నారట. ఆ అమ్మాయిని అప్పుడు మంజు అనేవాళ్ళు.

రఘు ఇంటికివచ్చి చక్కగా ముస్తాబై ఆ సుందరిని వెదకడానికి బయలుదేరాడు. కొంత వెతికిన తర్వాత వాళ్ళు వున్నఇల్లు కనుక్కోగలిగాడు.

అతి ఆనందంతో తలుపుకొట్టాడు. ఆ ఇంటి యజమాని తలుపుతెరచాడు. రఘు అతితొందరతో అడిగాడు— ఇక్కడ 'మంజు' అనే అమ్మాయి, తల్లి వున్నారా అని.

ఆ యజమాని పూర్వం వుండేవాళ్ళు, ఇప్పుడు లేరని తలుపువేయబోయాడు.

రఘు దీనంగా అడిగాడు. వాళ్ళు నాకు బంధువులు, వాళ్లని కలుసుకోవాలి. ఎక్కడవుంటారో దయచేసిచెప్పండి అని. ఆయన దయతలచి ఎడ్రసు ఇచ్చాడు.

రఘు అక్కడకు పరుగెత్తి తలుపుకొట్టాడు. లోపల నుంచి కాంతమ్మగారువచ్చి తలుపు తెరిచింది. అతడు నివ్వెరబోయి అడిగాడు.

"మంజు" ఎవరు?

"మా అమ్మాయ్!"

"మీ అమ్మాయా? ఆమెకోసమే వచ్చాను.

"ఈ ఉదయమే ఆమెను ఇంకొకరికి యివ్వడానికి నిశ్చయమైంది!"

రఘు రాయి అయిపోయాడు.

